డిచ్‌పల్లిలో ధూంధాం.. గురువారం నిర్వహించిన నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఆదిలాబాద్ ఆనంద తాండవం

నాట్యమాడిన నర్సాపూర్.. జనసునామీలా నిజామాబాద్

- ఆదిలాబాద్, బోథ్, నిజామాబాద్ రూరల్, నర్సాపూర్ కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలకు పోటెత్తిన జనం
- సీఎం కేసీఆర్ ప్రసంగం ఆద్యంతం చప్పట్లు, ఈలలు
- జయజయధ్వానాలతో హోరెత్తిన సభా ప్రాంగణాలు

ఉరకలెత్తే ఉత్సాహం.. ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో యువకుడి ఉత్సాహం

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ రాకతో ఆదిలాబాద్ ఆనంద తాండవం చేయగా.. నర్సాపూర్ నాట్యమాడింది. నిజామాబాద్‌లో జనసునామీ పోటెత్తింది. గురువారం ఆదిలాబాద్, బోథ్, నిజామాబాద్ రూరల్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ పాల్గొన్న ప్రజా ఆశీర్వాద సభల్లో జనహోరు కనిపించింది. సభాప్రాంగణాలే కాకుండా సభ నిర్వహిస్తున్న పట్టణ ప్రాంతాలు గులాబీమయం అయ్యాయి.

గులాబీ దళపతికి జేజేలు

గులాబీ దళపతి, సీఎం కేసీఆర్‌కు ఆదిలాబాద్ జేజేలు పలికింది. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లోని ఆదివాసీ గిరిజన, గిరిజనేతరులు వేలాదిగా సభలకు తరలివచ్చారు. ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాల మైదానం, బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రచార సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగానికి జనం జై కొట్టారు. గోడలపై కూర్చొని, రోడ్లపై నిల్చొని సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ప్రజలు ఆసక్తిగా విన్నారు. సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో ప్రతిపక్షాల తీరును ఎండగడుతున్నప్పుడు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. 'కరెంటు కావాల్నా? కాంగ్రెస్ కావాల్నా? రైతుబంధు కావాల్నా? రాబందులు కావాల్నా? అని కేసీఆర్ అడిగినప్పుడు కరెంటు, రైతుబంధు ఇచ్చే సర్కారు కావాలని ప్రజలు నినదించారు. కేసీఆర్ ఉర్దూ ప్రసంగానికి ముస్లిం మైనార్టీలు ఫిదా అయ్యారు.

పోటెత్తిన జనం

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లిలో, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో రెండు చోట్ల పోటాపోటీగా జనం హాజరయ్యారు. యువకులు, రైతులు, మహిళలు, వృద్ధులు, యువత.. అన్ని వర్గాల ప్రజలు జాతరకు పోయినట్టు సభలకు తరలివచ్చారు. కేసీఆర్ మాటలకు చప్పట్లు కొడుతూ.. ఈలలు వేస్తూ ఆమోదం తెలిపారు. 'ఓట్ ఫర్ కార్.. జై కేసీఆర్... జై బీఆర్ఎస్' నినాదాల హోరుతో సభా ప్రాంగణాలు మార్మోగాయి. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, 'కారు' గుర్తుతో కూడిన ఫ్లకార్డులు సభల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారుల ఆటాపాటలకు సభికులు ఉర్రూతలూగారు. దేఖ్‌లేంగే..., గులాబీల జెండలే రామక్క పాటలతో సభా ప్రాంగణాలు దద్దరిల్లాయి.

నేను సైతం: ఆదిలాబాద్ బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు వస్తున్న దివ్యాంగుడు

సీఎం కేసీఆర్ సభలో బుల్లెట్ల కలకలం

నర్సాపూర్, నవంబర్16: మెదక్ జిల్లా నర్సాపూర్‌లో గురువారం నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో బుల్లెట్ల కలకలం రేగింది. సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో అస్లాం అనే వ్యక్తి ప్రెస్ గ్యాలరీ కూర్చున్నాడు. అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీ చేశారు. రెండు బుల్లెట్లు దొరకడంతో స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రస్తుతం చిలప్‌చెడ్ మండలం చంద్రులో ఉంటున్నట్టు తెలిసింది. అతను ఓ చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. డిగ్రీ క్లాస్‌మేట్ సహాయంతో ఓ యూట్యూబ్ చానల్ ఐడీ కార్డు సంపాదించినట్టు తేలింది. అస్లాం గతంలో ఎన్‌సీసీలో పనిచేసినట్టు సమాచారం. అక్కడ పనిచేసినప్పుడే తీసుకొచ్చిన బుల్లెట్లు అయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా అస్లాం కర్ణాటకకు చెందిన వ్యక్తిగా కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు నిందితుడిని విచారిస్తున్నారు.

మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రజా ఆశీర్వాద సభా వేదికపై సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్

ఫలించిన హరీశ్‌రావు వ్యూహం

- సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్, బీజేపీకి షాక్
- కారెక్కిన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ గాలి అనిల్‌కుమార్,
- బీజేపీ నేతలు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, శ్రీకాంత్‌గౌడ్

సంగారెడ్డి, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఎన్నికల వ్యూహాలు ఫలిస్తున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలుపు లక్ష్యంగా పనిచేస్తున్న హరీశ్‌రావు రాజకీయ ఎత్తుగడలకు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు చిత్తవుతున్నాయి. మంత్రి హరీశ్‌రావు చొరవతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం నర్సాపూర్‌లో ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ సమక్షంలో గాలి అనిల్‌కుమార్ గులాబీ కండువా కప్పుకున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు, పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల నేతలు గడీల శ్రీకాంత్, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే కూడా బీఆర్ఎస్‌లో చేరారు. ఒకేరోజు కాంగ్రెస్, బీజేపీకి చెందిన ముగ్గురు కీలక నేతలు కారెక్కడంతో సంగారెడ్డి, పటాన్‌చెరులో బీఆర్ఎస్‌కు మరింత బలం చేకూరనున్నది. సంగారెడ్డి జిల్లాలో ఇటీవలే సదాశివపేటకు చెందిన బీజేపీ ముఖ్యనేత శివరాజ్‌పాటిల్, నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేత విజయపాల్‌రెడ్డి సైతం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన సంగతి తెలిసిందే.

గురువారం నర్సాపూర్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న గడీల శ్రీకాంత్‌గౌడ్, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, సింగాయిపల్లి గోపీ. చిత్రంలో మంత్రి హరీశ్‌రావు

..బలిదానాలకు మా బాధ్యత లేదు

మొదటిపేజీ తరువాయి...

వందలమంది తెలంగాణ బిడ్డల ఆత్మహత్యలకు ఈ చిదంబరమే కారకుడు. 2009లో తెలంగాణ ఏర్పాటు ప్రకటన చేసి.. అంతలోనే సమైక్యవాదుల లాబీయింగ్‌కు భయపడి వెనక్కు తీసుకొన్నారు. ఈ రెండు ప్రకటనలు చేసింది చిదంబరమే. ఆయన ప్రకటన వల్లనే నిర్వేదంలోకి వెళ్లిన అనేకమంది తెలంగాణ ఉద్యమకారులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఆ బలిదానాలపై కనీస విచారం వ్యక్తంచేయకుండా 'సారీ' అన్న ఒక్క మాటతో తేల్చిపడేశారు. నిజానికి తెలంగాణ బిడ్డల ఆత్మహత్యలకు కేంద్రానికి ఎంత బాధ్యత ఉన్నదో.. చిదంబరానికి కూడా అంతే బాధ్యత ఉన్నది.

పిల్లలాట కాకుంటే వెనక్కి ఎందుకు వెళ్లారు?

రాష్ట్ర ఏర్పాటు అనేది పిల్లలాట కాదని చిదంబరం చెప్పుకొచ్చారు. ఎంతో కసరత్తు తర్వాత, ఎన్నో చర్చల తర్వాతనే 2009, డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను మొదలుపెడుతున్నట్టు ప్రకటించాం అని తెలిపారు. మరి అంత కసరత్తు చేసి, అంతగా చర్చలు జరిపిన తర్వాత ఆ ప్రకటన నుంచి ఎందుకు వెనక్కు వెళ్లారు? రాష్ట్ర ఏర్పాటు పిల్లలాట కాదన్నది మీరే.. ఎంతో కసరత్తు తర్వాత ప్రకటన చేశామన్నది మీరే.. మరి అంత సీరియస్‌గా చర్చించి నిర్ణయం తీసుకొన్న తర్వాత ఎందుకు వెనక్కు తగ్గారు? చిదంబరానికి ఆ నిర్ణయం చాలా చిన్నదై ఉండవచ్చు. కానీ, తెలంగాణకు 1200 వందల మంది గొప్ప భవిష్యత్తు ఉన్న యువకుల ప్రాణార్పనలు. వారి ప్రాణాలను తిరిగి తీసుకురాగలరా? వారి కుటుంబాల వ్యథను తీర్చగలరా? ఇంత చేసి కూడా 'మా బాధ్యత లేదు' అని ఎలా తప్పించుకొంటారు? చిదంబరం తాను చెప్పిన విషయాన్ని తానే ఖండించుకొన్నారు.

సాధారణ ఆత్మహత్యలకు.. బలిదానాలకు పోలికా?

తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన 1200 మంది బలిదానాలకు బాధ్యత తమది కాదంటున్న కాంగ్రెస్ నేత చిదంబరం.. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నాలుగు వేల మంది ఆత్మహత్య చేసుకున్నారని.. దానికి రాష్ట్ర సర్కారు బాధ్యత వహిస్తుందా? అని కొత్త చర్చను లేవనెత్తారు. తద్వారా ఉదాత్త ఆశయంతో ప్రాణత్యాగం చేసిన అమరులను చిదంబరం అవమానించారు. సామాజిక, ఆర్థిక, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకొనేవారితో అమరులను పోల్చి ప్రాణత్యాగాన్ని అపహాస్యం చేశారు. వారి ఆత్మలను క్షోభపెట్టారు. ప్రాణత్యాగం చేసినవారంతా ఉద్యమకారులు, ఉద్యమ భావజాలంతో తెలంగాణే శ్వాసగా బతికిన యువతే. దశాబ్దాల ఆకాంక్షను నెరవేర్చాల్సిన కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సాగతీత ధోరణితో నిస్సహాయ స్థితిలో, కనీసం తమ చావుతోనైనా కేంద్రం కండ్లు తెరుస్తుందనే ఆశతో తనువు చాలించారు. ఇవి సాధారణ ఆత్యహత్యలుగా చిదంబరం చిత్రీకరించారు. ఒక ఆశయసాధనలో అసువులు బాసిన అమలరును కీర్తిస్తూ వారి కుటుంబాలకు ఉద్యోగాలు, పరిహారం ఇవ్వటం దేశంలో కొనసాగుతున్న ఆనవాయితీ. అందుకే తెలంగాణ ప్రభుత్వం అమరవీరుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి గౌరవించింది. సాధారణంగా ఆత్మహత్య చేసుకోవటం నేరమనే విషయం ఒక లాయర్‌గా, కేంద్రహోంమంత్రిగా పనిచేసిన చిదంబరానికి తెలియదనుకోలేం. బలిదానాలపై నిర్మితమైన తెలంగాణ అస్థిత్వాన్ని కించపరుస్తూ చిదంబరం సరిదిద్దుకోలేని నేరం చేశారు. కాంగ్రెస్ పాలనలో దేశంలో కొన్ని వేలమంది ఆత్మహత్యలు చేసుకొన్నారు. ఆ పార్టీ పాలనలో వేలమంది రైతులు ఉరికొయ్యలకు వేలాడారు. దానికి ఎవరు బాధ్యత వహించాలి?

కేసీఆర్ ఉద్యమాన్ని ఒప్పుకొన్న చిదంబరం

తెలంగాణ ప్రజల పోరాటానికి తలవంచే కేంద్రం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటుచేసిందని చిదంబరం చెప్పుకొచ్చారు. కేసీఆర్ ఒక్కడి వల్ల తెలంగాణ రాలేదని అన్నారు. మరోవైపు మలిదశ తెలంగాణ ఉద్యమానికి సీఎం కేసీఆరే ముఖచిత్రమని పేర్కొన్నారు. అందుకే ఆయన సీఎం అయ్యారని చెప్పారు. 'ఉద్యమం జరిగినప్పుడు కేసీఆరే ప్రాణి నెంట్ లీడర్. అందుకే ఇప్పుడు ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నారు' అని పేర్కొన్నారు. నిజానికి సీఎం కేసీఆర్ ఎన్నడూ తెలంగాణను తానొక్కడినే తెచ్చానని చెప్పలేదు. ప్రతి సభలోనూ 'ఒక్కో తెలంగాణ బిడ్డ ఒక్కో పులిలా కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొన్నాం' అని స్పష్టంగా చెప్తున్నారు.

సమైక్య రాష్ట్రం కోసం ఉద్యమం ఎక్కడ జరిగింది?

తెలుగు ప్రజలంతా ఒక్కటిగా ఉండేందుకు సమైక్య రాష్ట్రం కోసం గొప్ప ఉద్యమం జరిగిందని చిదంబరం మరో ఆణిముత్యం వదిలారు. ఈ విషయం సీఎం కేసీఆర్‌కు తెలియదని చెప్పుకొచ్చారు. ఇంతకూ సమైక్య రాష్ట్రం కోసం ఉద్యమం ఎక్కడ జరిగిందో ఈ కుహనా మేధావి చెప్పనే లేదు. నిజానికి ఉమ్మడి రాష్ట్ర ఏర్పాటు ఆలోచనను కూడా తెలంగాణ సహించలేదు. సమైక్యాంధ్ర ప్రతిపాదనకు వ్యతిరేకంగా భారీ ఉద్యమాలు జరిగాయి. ఆంధ్రప్రాంతం నుంచి ఉద్యోగులు అక్రమంగా చొరబడటం, ఆంధ్రప్రాంతాన్ని హైదరాబాద్ రాష్ట్రంతో కలపాలన్న ఆలోచనలను వ్యతిరేకిస్తూ 1952లోనే 'ఇడ్లీ సాంబార్ గో బ్యాక్' అంటూ భారీ ఉద్యమం జరిగింది. ఉద్యమాన్ని అణగదొక్కేందుకు హైదరాబాద్‌లోని సిటీ కాలేజీలో విద్యార్థులపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన పోలీసు కాల్పులు, అందులో ఏడు మంది ప్రాణాలను బలిగొన్న విషయాన్ని చిదంబరం మర్చిపోయారా? 1955 మార్చి 5వ తేదీన హైదరాబాద్‌ను, ఆంధ్రతో కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడంపై నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ.. 'తెలంగాణ అనే ఒక అమాయకపు అమ్మాయిని, ఆంధ్ర అనే తుంటరి అబ్బాయికి ఇచ్చి పెండ్లి చేస్తున్నాం. వాళ్లు కలిసి ఉండొచ్చు. ఇమడలేకపోతే విడిపోవచ్చు' అని చెప్పిన మాటలు చిదంబరానికి తెలుసా? తెలంగాణకు ఇష్టం లేకపోయినా ఆంధ్రతో కలుపుతున్నామని నెహ్రూ పరోక్షంగా ఆనాడే చెప్పారు. అటు ఆంధ్రాలోనూ పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేసి మరణించడానికి కూడా నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం. చిదంబరం ఈ మాత్రం చరిత్రను తెలుసుకోకపోవడం సిగ్గుచేటు. నిజానికి ఆంధ్రావారిని నడిరోడ్డుమీదికి తోసేసిందే ఈ చిదంబరం రాష్ట్రీయులు. 1950 వరకు మద్రాస్ రాష్ట్రంలో కలిసి ఉన్న ఆంధ్రా, రాయలసీమవారు తమకు స్వరాష్ట్రం కావాలని డిమాండ్ చేస్తే.. 24 గంటల్లో మద్రాస్‌ను ఖాళీ చేసి వెళ్లిపోవాలని డెడ్‌లైన్ విధించింది చిదంబరం పూర్వీకుడైన సీ రాజగోపాలా చారియే. 1951లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైతే.. 1956 వరకు హైదరాబాద్ స్టేట్‌ను ఆంధ్రాతో కలిపేవరకు జరిగిందంతా ఆంధ్రుల లాబీయింగే తప్ప.. ఎక్కడా ఒక్కరోజు ఉద్యమం కూడా జరుగలేదు. దుర్మార్గం ఏమంటే ఆ లాబీయింగ్‌లో రెండువైపులా ఉన్నది కాంగ్రెస్‌వారే కావటం. 5 ఏండ్ల లాబీయింగ్‌కు తలొగ్గి ఉమ్మడి రాష్ట్రం ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ.. మరి తెలంగాణ ఉద్యమాన్ని 60 ఏంట్లపాటు ఎందుకు పట్టించుకోలేదు?

వంటగ్యాస్ జీఎస్టీ పరిధిలోనిదని తెలియదా?

వంటగ్యాస్ సిలిండర్ ధరలు తెలంగాణలోనే అధికంగా ఉన్నాయని చిదంబరం చెప్పారు. కానీ, వంటగ్యాస్ సిలిండర్ ధరలు జీఎస్టీ పరిధిలో ఉన్నాయన్న విషయం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన చిదంబరానికి తెలియకపోవటం విషాదం. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్‌పై కేంద్రం ఐదు శాతం, రాష్ట్రాలు ఐదు శాతం పన్నులు మాత్రమే విధించేందుకు అవకాశం ఉన్నది. అంతకన్నా ఒక్క రూపాయి అదనంగా వసూలు చేసే అవకాశమే లేదు. చిదంబరం చెప్పిన మరో అబద్ధం. తెలంగాణ అప్పులు పెరిగిపోయాయని. అప్పుల్లో తెలంగాణ దేశంలోనే చివరి నుంచి ఐదో స్థానంలో ఉన్నదని స్వయంగా కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐ చెప్పాయి. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలన్నీ తెలంగాణను మించి అప్పుల ఊబిలో కూరుకుపోయిన విషయాన్ని చిదంబరం తెలుసుకొంటే మంచిది.

వందల బలిదానాలకు కాంగ్రెస్‌దే బాధ్యత

చిదంబరం వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపాటు

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమంలో వందల మంది బలిదానాలకు కాంగ్రెస్ పార్టీదే బాధ్యత అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. 'తెలంగాణ ఉద్యమ సమయంలో చోటుచేసుకున్న ఆత్మహత్యలకు సారీ' అని చిదంబరం చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్విట్టర్‌లో 'చిదంబరం జీ! ఇప్పటికే చాలా ఆలస్యమైంది. సారీ అన్న పదం చాలా చిన్నది కూడా. 1952–2014 మధ్య వందల మంది యువత ఆత్మబలిదానానికి కాంగ్రెస్‌దే బాధ్యత. ఇప్పుడు ఎన్ని క్షమాపణలు చెప్పినా, ఎంత కష్టపడినా కాంగ్రెస్ దౌర్జన్యాలను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు' అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

ఈసీ అనుమతిస్తే వారంలోపే రుణమాఫీ

- ఇప్పటికే 80 శాతం మంది రైతులకు రుణమాఫీ వర్తింపు
- బీఆర్ఎస్ గెలిచిన వెంటనే రైతుబంధు 16 వేలు చేస్తాం
- ధరణి పోర్టల్ వద్దన్నోన్ని బంగాళాఖాతంలో కలపాలి
- ప్రతిపక్ష పార్టీలకు స్పష్టమైన ఎజెండా లేకే బూతులు
- అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- నర్సాపూర్ ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు

మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబర్ 16 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): ఎన్నికల కమిషన్‌నుంచి అనుమతి రాగానే వారంలోపే రైతు రుణమాఫీ పూర్తి చేస్తామని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఒకవేళ అనుమతి రాకుంటే డిసెంబర్ 3 తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క రుపాయి లేకుండా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. 'ప్రతిపక్షాలకు ఎజెండా లేకనే బూతులు మాట్లాడుతున్నయి. బూతులు కావాల్నా.. భవిష్యత్తును అందించే నాయకుడు కావాల్నా? ప్రజలు ఆలోచించుకోవాలి. సీఎం కేసీఆర్ వచ్చాక రూ.2 వేల ఆసరా పింఛన్ వస్తున్నది. పేదింటి ఆడపిల్ల పెండ్లిల్లకు కల్యాణలక్ష్మి వస్తున్నది' అని పేర్కొన్నారు. గురువారం మంత్రి హరీశ్‌రావు నర్సాపూర్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొని, మాట్లాడారు. ఎండాకాలంలో మంజీరలో, హల్దీలో నీళ్లు లేవని మదన్‌రెడ్డి చెప్పగానే.. మల్లన్నసాగర్ నుంచి నీళ్లు వదిలామని, అన్ని మండలాల్లో నీటి మట్టం పెరిగిందని చెప్పారు. నేడు ఒక్క గుంట ఎండకుండా పంట పండేటట్టు చేసింది సీఎం కేసీఆరే అని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రైతుబంధు రూ.16 వేలకు పెరుగుతుందని వెల్లడించారు. పింఛన్ రూ.5 వేలు అవుతుందని, గ్యాస్ సిలిండర్‌ను రూ.400కే అందిస్తామని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు 3 గంటలే కరెంట్ చాలని, రైతుబంధు దుబారా అని, ధరణిని తీసేస్తామని మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ధరణి వద్దన్నోళ్లను బంగాళాఖాతంలో కలుపాలని పిలుపునిచ్చారు.

నర్సాపూర్ గడ్డ.. గులాబీ జెండా అడ్డ..

నర్సాపూర్ అంటే గులాబీ జెండా అడ్డా అని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. 2001 నుంచి తెలంగాణకోసం నడుం బిగించిన గడ్డ ఇదని తెలిపారు. ఉద్యమస్ఫూర్తితో ఈ ఎన్నికల్లో సునీత లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలిపునిచ్చారు. తెలంగాణ ప్రజలు సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రాణాలకు తెగించి పోరాడితేనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని పేర్కొన్నారు. ముందే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చి ఉంటే వందల మంది పిల్లల ప్రాణాలు కాపాడగలిగే వాళ్లమని చెప్పారు. అందుకే రేవంత్‌రెడ్డి సోనియాను ఇటలీ బొమ్మ, బలిదేవత అన్నారని గుర్తుచేశారు. కుర్చీ కోసం ఇప్పుడు రేవంత్ మాట మార్చాడని దుయ్యబట్టారు. ఈసారి కూడా కేసీఆర్‌ను దీవించి, హ్యాట్రిక్ సీఎంగా చేద్దామని పిలుపునిచ్చారు.

అబద్ధాలకు చిరునామా చిదంబరం

- చంపినోడే సంతాపం తెలిపినట్టు ఆ కాంగ్రెస్ నాయకుడి తీరు
- కాంగ్రెస్ వల్లే తెలంగాణలో యువకుల ఆత్మబలిదానాలు
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలుసుకొని మాట్లాడాలి
- కాంగ్రెస్ నేత చిదంబరంపై మంత్రి హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): చంపినోడే సంతాపం తెలిపినట్టు కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం తీరు ఉన్నదని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటు ప్రకటన చేసిన చిదంబరం ఆ ప్రకటనను వెనక్కి తీసుకున్న ఫలితంగానే ఉద్యమంలో పౌరులు ఆత్మబలిదానాలు చేసుకున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణపై చిదంబరానికి అవగాహన లేదని విమర్శించారు. పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్షకు, తెలంగాణకు సంబంధం ఏమిటని నిలదీశారు. పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తే తెలుగు వాళ్ల ఐక్యత కోసం, ఆంధ్రప్రదేశ్ కోసం చేశారని అబద్ధాలు చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం ఉద్యమించినపుడు కేంద్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? కేంద్రంలోని నెహ్రూ ప్రభుత్వం తాత్సారం చేయటం వల్లే కదా పొట్టి శ్రీరాములు చనిపోయింది? అని సూటిగా ప్రశ్నించారు. చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని చిదంబరానికి హితవు చెప్పారు. మద్రాసు రాష్ట్రం ఉండేదని, తెలంగాణ రాష్ట్రం లేదని చిదంబరం మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నదని తెలిపారు. 1948 నుంచి 1956 వరకు హైదరాబాద్ స్టేట్ (తెలంగాణ) ఉన్న చారిత్రక విషయాన్ని చిదంబరం తెలుసుకోవాలని చురక అంటించారు. తెలంగాణ అప్పులు, ఆదాయంపై చిదంబరం దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న ఆర్థిక క్రమశిక్షణ ఏ కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలోనైనా ఉన్నదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై ఆర్బీఐ నివేదికలు ఏం చెప్తున్నాయో తెలుసుకుంటే మంచిదని సూచించారు. ఒక్క చాన్స్ అంటే నమ్మేందుకు తెలంగాణ ప్రజలు అమాయకులు కారని తేల్చిచెప్పారు. దమ్ముంటే చిదంబరం తన సొంత రాష్ట్రం తమిళనాడులో కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవాలని సవాల్ విసిరారు. సుదీర్ఘ పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని స్పష్టం చేశారు. ఎవరెన్ని ట్రిక్కులు ప్లే చేసినా, ఎంత మంది వచ్చి దుష్ప్రచారం చేసినా తెలంగాణ ప్రజలు కేసీఆర్‌వైపే ఉన్నారని తేల్చిచెప్పారు.

అది కాంగ్రెస్ నిరుద్యోగుల బస్సు యాత్ర: తుంగ బాలు

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నిరుద్యోగుల బస్సు యాత్రకు 'కాంగ్రెస్ రాజకీయ నిరుద్యోగుల బస్సు యాత్ర' అని పేరు పెడితే బాగుంటుందని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు తుంగ బాలు ఎద్దేవా చేశారు. తొమ్మిదేండ్ల కేసీఆర్ పాలనలో 1.65 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారని, ఇంకా 85 వేల ఉద్యోగాలు భర్తీ ప్రక్రియలో ఉన్నాయని వివరించారు. నిరుద్యోగుల తరపున ఉన్నది కేసీఆర్ మాత్రమేనని, రేపు ఉద్యోగాలను భర్తీ చేసేది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని బస్సు యాత్రలు చేపట్టినా తెలంగాణ ప్రజలు అధికారం అప్పగించేది ముఖ్యమంత్రి కేసీఆర్‌కేనని తుంగ బాలు స్పష్టం చేశారు.